# సమర్థ సద్గురు

జులై 2024

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



26.05.2024 నుండి 10.06.2024 వరకు శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన దృశ్యములు.









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 11
పేజీలు 44
జులై 2024

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 8
శ్రీ గురు పాదాలు .................... ......................10
దానము ......... . ..............................................12
శబ్ద స్వరూపుడు హనుమ. .........................15
శ్రీ శివ దర్శనం ..............................................18
రథసప్తమి - జిల్లేడాకు......................................20
అక్షరాభ్యాసం........... ........... ........ ........ ..... .........21
శ్రీ దాసశేష స్వామి....... ....................................25
నారద భక్తి సూత్రములు ................ ..............27
మాయా వైభవము .......................................29
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......30
మనశ్శతకము ..................................................31
నిరీక్షణ ...........................................................32
శ్రీ శంకర జయంతి......... .........................34
మనస్సును అంతర్ముఖం చేయి ........36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

48) పరధనముల్ హరించి పరభామలనంటి పరాన్న మబ్బినన్
మురిపమ కానిమీదనగు మోసమెరుంగదు మానసంబు
స్తరమదికాలకింకర గదాహతి పాల్పడనీక మమ్ము నేదు
తరిదరిచేర్చి కాచెదవో దాశరథీ కరుణాపయోనిధీ!



భావం - మేము పరాయిసొమ్ముకాశించినా, పరస్త్రీ వ్యామోహం పొందినా, పరాన్న భోజనము కోరినా, అవివేకులమై ఘోరాతి ఘోరములైన పాపములు చేసినను మము రక్షించుటయే నీ వంతు. 'తప్పులు చేయుట మావంతు, యమ దండన పొందుట మావంతు, దయ చూడటమే నీ వంతు' దాశరథీ దయాశరథీ! మమ్ము కాపాడుము. యమదూతల శిక్షల నుంచి కాపాడుము స్వామీ!

*దేవేంద్రుడు స్వర్గం కంటే బురదలోనే సుఖంగా ఉందని ఎందుకు అన్నాడు?
*యజ్ఞం చేసిన నెయ్యి మీద పడిన మేక ఏమయ్యింది?
*మనస్సును అంతర్ముఖం చేయడం ఎలా?
*అంతకు ఇంతయ్యింది కానీ ఇక ఇంతకు ఇంతే అని ఎందుకు అన్నారు?
*ఇతరుల మనస్సులను నియంత్రించగల సమర్థత ఎలా కలుగుతుంది?
*ఒక్క రాత్రిలో ఆరు నెలలు ఎలా గడిచిపోయాయి?
*మునిగిపోతున్న శిష్యుడు ఎవరు చేయి అందించినా ఎందుకు పట్టుకోలేదు?
*ఏసుక్రీస్తుకు శిలువ వేసినా బాధ ఎందుకు తెలియలేదు?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

10-1- 1981

ఈ రోజు ఉదయం వాహ్యాళికి వచ్చినపుడు శ్రీ బాబూజీ మమ్మల్ని ప్రశ్నించారు. "ఏసుక్రీస్తుని శిలువ వేశారు కదా? మరి ఆయనకి ఆ బాధ లేదా? ఆ బాధని ఎలా ఓర్చుకోగలిగాడు. ఆయనని శిలువ వేసిన వారిని సైతం రక్షించమని ప్రార్థించాడు కదా! అది ఎలా సాధ్యం చెప్పండి చూద్దాం? మీలో ఎవరైనా చెప్పవచ్చు" అన్నారు. డాక్టరు రాజు చెపుతూ "క్లోరోఫారం ఇచ్చిన రోగికి ఏమీ తెలియనట్లు ఏసుక్రీస్తుకి కూడ దేహదృష్టి లేదు. కాబట్టి ఏమీ తెలియదు" అన్నాడు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ "క్లోరోఫారం మత్తు ఎంత సేపు ఉంటుంది? ఆ మత్తు తగ్గిన తర్వాత బాధ తప్పదు కదా!" అన్నారు.



డాక్టరు స్వర్ణ మాట్లాడుతూ "మనస్సు పరమాత్మపై లగ్నమై ఉన్నవాడికి దేహభావన ఉండదు కాబట్టి ఏసుక్రీస్తుకి బాధ లేదు" అని చెప్పింది. శ్రీ బాబూజీ కల్పించుకొని "అనుభవంతో కూడిన సమాధానం అలా ఉండదు" అన్నారు. ఇంకొక భక్తుడు చెపుతూ "అందరిలో ఉన్న ఆత్మవస్తువు ఒక్కటే. ఏసుప్రభువులోనూ ఏసుప్రభువును శిలువ వేసిన వారిలోనూ ఉన్నది అదే ఆత్మవస్తువు. కాని వారిలో ఉన్న రాక్షసప్రవృత్తి వారిని అలా చేయించింది. అందుచేతనే వారిని కూడా రక్షించమని ప్రార్థించాడు" అన్నాడు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "ఆ ఆత్మవస్తువుని దర్శించావా? దర్శించి చెపితే బావుంటుంది" అన్నారు. కాళీమాత మాట్లాడుతూ ఏసుప్రభువుకి దేహదృష్టి ఇంద్రియ భావన లేదు" అంది. "అయితే ఇంత తెలిసిన దానివి ఏ నామస్మరణ లేకుండా మొద్దునిదుర ఎలా పోగలుగుతున్నావు?" అని శ్రీబాబూజీ ప్రశ్నించారు.

కమలమ్మగారు మాట్లాడుతూ "ప్రభువు పరమదయామయుడు. ఆయన అందరినీ రక్షిస్తాడు. అందరినీ సమానంగా చూస్తాడు. కాబట్టి ఆయనని హింసించిన వారిని సైతం రక్షించమని ప్రార్థిస్తాడు" అన్నారు.

శ్రీబాబూజీ మాట్లాడుతూ "మీలో ఎవ్వరికీ అనుభవంలేదు. అందుచేత చెప్పలేక పోతున్నారు. ఏసుప్రభువు మూడు దినములు శిలువ మీద ఉన్నాడు. ఆయనకు దేహభావన, ఇంద్రియదృష్టి లేవు. కాబట్టి ఆ బాధ ఏమి తెలుస్తుంది? అంతవరకు కరక్టే. కాని ఇది ఎంతవరకు సాధ్యపడుతుంది? మీకు ఒక ఉదాహరణ చెప్తాను.

ఒక పచ్చికొబ్బరికాయు ఉందనుకోండి. దానిని పలుగుతో కొట్టామనుకోండి. ఏమవుతుంది? ఆ కాయ లేతదై ఉంటే ఆ పలుగు టెంకలోనుంచి లోపలికి దిగుతుంది. ఆ కాయ బయట ఉన్న పీచు దుఃఖము, టెంక సంకల్పము, లోపల ఉన్న నీరు కలుషము. ఇవన్నీ హరించి కాయలోపల కొబ్బరి గట్టిపడి ఇంకా బాగా ఎండిన తరువాత కురిడి గలగలమని శబ్దము చేస్తుంది. అదే సోஉహంభావన. అప్పుడు ఆ కొబ్బరికి బయటనున్న వారితో సంబంధం వుంటుందా? అటువంటి కొబ్బరికాయుని పలుగుతో పొడిచామనుకోండి. ఆ పలుగు టెంకను దాటి వెళ్ళగలుగుతుందా ? అలాగే మనస్సు ఇంద్రియముల నుండి మరలి అంతర్ముఖమైన మానవునికి కూడా దేహభావన ఇంద్రియభావన ఉండదు. ఏసుక్రీస్తు యొక్క స్థితి అది" అన్నారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ "శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు 8 నెలలు జల సమాధిలో ఉన్నారు. ఆయన నదీ జలాల అడుగున భూమిలో సమాధిలో ఉన్నారు. ఆ ప్రదేశంలో అనుకోకుండా పలుగుతో త్రవ్వినపుడు రక్తం చిమ్ముతుంది. అప్పుడు ఆయన అక్కడ ఉన్నట్లు తెలుసుకుంటారు. అంతగాయమైనా ఆయన ఇంకా సమాధిలోనే ఉన్నారు. అది మహాత్ముల స్థితి. బలిచక్రవర్తి 6000 సంవత్సరాలు సమాధి స్థితిలో వున్నాడు. గురునానక్ దేహాన్ని విడిచి మహా సమాధిస్థితి పొందినపుడు అన్ని మతాలవారు ఆయన దేహంకోసం పోట్లాడుకుంటారు. ఆయన దేహము పూలహారమై అన్ని మతాలకు చెందిన పుష్పేశ్వరుడయ్యాడు. సమాధిస్థితి పొందినవారికి దేహభావన లేకుండా పోతుందా? శ్రీ బాబూజీగారు కోతలు కోసేస్తున్నారు. అని మీరు అనుకోవచ్చు. కాని అది యథార్థము. మీకు ఒక ఉదాహరణ చెప్తాను.

ఇద్దరు బావామరుదులు చాలాకాలం తర్వాత కలుసుకున్నారు. ఇద్దరు భోజనంచేసి చల్లగాలికి ఇంటి పెరట్లో కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు. బావగారు ఆ క్రితంరోజంతా ప్రయాణంచేసి అలసి పోయాడు. ఇద్దరూ సిగరెట్లు కాలుస్తున్నారు. కొంతసేపైన తర్వాత బావగారి

చేతిలో సిగరెట్టు కాలుతూనే ఉంది. నిదుర పట్టేసింది. ఏవండి బావగారూ వింటున్నారా? అని ఆ బావమరిది ఎంత మొత్తుకుంటే ఏం లాభం? బావగారు గాఢ సుషుప్తిలో వున్నారు. సిగరెట్టు కాలిపోయి చెయ్యి కాలినా తెలియలేదు.

చూశారా గాఢ సుషుప్తిలోనే దేహాన్ని మరచాడు కదా! ఇంక ఆ మనస్సు ఆ పరమాత్మపై లగ్నమై, సమాధిస్థితిలో ఉన్న వాడికి దేహభావన ఉంటుందా? ఇప్పుడు నేను చెప్పింది మీకందరికి అనుభవమే కదా! మీరు గాఢ నిద్రలో ఉన్నారనుకోండి మీకు తెలుస్తుందా?" అని ప్రశ్నించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జులై 2024**

1 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 ఉ. గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

17 బుధ: తొలి ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

21 ఆది: ఆషాఢ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

30 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**ఆగస్ట్ 2024**

2 శుక్ర: మాసశివరాత్రి

19 సోమ: శ్రావణ(రాఖీ) పూర్ణిమ, - ఉ.11.00 గం.లకు సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

28 బుధ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*సద్గురు చరణం - భవహరణం*

"పంచదార చిలుకని, ఎటు నుంచి కొరికినా మధురమే. అట్లాగే భగవత్తత్వం కూడా మధురాతి మధురమైనది. అది ఏ నోట పలికినా, వినినా, మధురంగానే వుంటుంది. కానీ కేవలం ఆ మధుర తత్త్వాన్ని మనం విని ఊరుకుంటే, ఆ బ్రహ్మానందాన్ని మనం అందుకోలేము. మహాత్ముల నోట వచ్చిన తత్వ రహస్యాలని జాగ్రత్తగా, చెవులారా శ్రవణం చేసి, దానినే నిరంతరం మననం చేసుకుంటూ, విన్న దానిని ఆచరణలో పెట్టిననాడు ఉప్పు



బొమ్మ సముద్రంలో లీనమయిపోయినట్టుగా, ఆ బ్రహ్మానంద సాగరంలో మనం లీనమయిపోతాము. అప్పుడే మానవుడికి నిజమైన శాంతి, సుఖము లభ్యమవుతాయి.

మనం ఒక ఐ.ఎ.ఎస్ (I.A.S) డిగ్రీ సంపాదించాలంటే, ఎంతో కష్టపడి చదివి, అన్నిటిలోనూ ఫస్టు మార్కులు సంపాదించి, మన సరదాలని, సినిమాలని, విహారాలని, బాతాఖానీలని, ఎన్నింటినో త్యాగం చేస్తేనే గాని, మనకా డిగ్రీ లభించటం లేదు. ఇంతా కష్టపడితే, యివి కేవలం మన పొట్టకూటికి మాత్రమే పనికి వచ్చే విద్యలు గాని, ఈ డిగ్రీలు మనని సంసారసాగరం నుండి రక్షించవు. మరి యీ లౌకికవిద్యలకే యింత శ్రమించవలసి వుంటే, భవసాగరమును దాటించి, తానెవరో తాను తెలుసుకునే 'బ్రహ్మవిద్య'ను ఆర్జించాలంటే యింకెంత కష్టపడాలి? అలాగని సాధకులు నిరాశపడనవసరం లేదు. దానికే గీతలో కృష్ణ భగవానుడు, '**శ్శనైశ్శనైరుపరమేత్। బుద్ధ్యాధృతి గృహీతయా। ఆత్మ సంస్థమ్ మనః కృత్వా। న కించిదపి చింతయేత్** - అని శెలవిచ్చారు. అంటే సాధన మెల్లమెల్లగా చేస్తూ, విషయాదుల వెమ్మట పరుగులు పెట్టే మనస్సుని బాహ్యాప్రపంచము నుండి మరల్చి, అంతర్ముఖపరచి విశ్రాంతిని పొందవలెను. ఆత్మేతర విషయములు వేటిని చింతింపకూడదు, అని పై శ్లోకానికర్థం.

ఇదే వేదాంత పరిభాషలో 'నేతి నేతి' వాక్యాల ద్వారా పొందవచ్చు అన్నారు. అంటే న+యితి = నేతి - అనగా ఇది కాదు, ఇది కాదు అని ఒక్కొక్క దృశ్య పదార్థాన్ని త్రోసి ముందుకు వెళ్తే, తానెవరో తాను తెలుసుకో గలుగుతాడు సాధకుడు. ఉల్లిపాయ లోని ఒక్కొక్క పొర తీసుకుంటూ వెళితే యిక చివరికి ఏమీ మిగలదు - వొలిచే వాడే మిగులుతాడు. అంటే దృశ్య జగత్తుని వదలి, తాను 'దృక్'గానే మిగులుతాడు. అదే ఆత్మ స్వరూపం. ఇట్టి ఆత్మ స్వరూపముని తెలియ చేసే విద్యయే అసలైన విద్య. 'యా విత్' ఏది తెలుసుకుంటే యిక తెలుసుకోవలసినది లేదో అది నిజమైన విద్య.

ఇట్టి బ్రహ్మవిద్యను తెలుసుకోవడానికి మనకి సమర్థుడైన గురుమూర్తి అవసరం. పరశువేది ఇనుముని బంగారంగా మార్చగలదుగాని, దానిని మరొక పరశువేదిగా మార్చలేదు. కానీ సత్య గురుదేవుడు, తనని నమ్మిన శిష్యులని, తనంత వారిగా, తనకంటే మిన్నగా మార్చగలరు. మీరా, జ్ఞానదేవ్, తుకారామ్ ఇత్యాది మహాభక్తులు నడచిన మార్గంలో మనం నడిస్తే వారు పొందిన ఆనందం మన సొత్తవుతుంది.

ఇట్టి బ్రహ్మవిద్యని పొందాలంటే సద్గురువులని భక్తి శ్రద్ధలతో సేవించి, సమయా సమయములు చూసి, పరిప్రశ్నా పూర్వకంగా అర్థిస్తే, ఆ తత్వదర్శనులైన జ్ఞానులు మనకి జ్ఞానాన్ని వుపదేశిస్తారని గీతలో భగవానుడు శెలవిచ్చాడు.

అట్టి గురుమూర్తి ఉపదేశించిన తారక మంత్రమును ఎంతో భక్తి శ్రద్ధలతో, పట్టుదలతో ధ్యానించిననాడు, మన ధ్యానగమ్యమైన ఆత్మానందాన్ని పొందగలుగుతాము."

**భగవన్నామమనెడి దివ్యమణి దీపాన్ని నాలుక అనే గడప మీద వుంచినచో దేహమనే ఇంటిలోపల, బయట వెలుగుల వెల్లువ వెల్లివిరుస్తుంది. అప్పుడు సర్వత్రా మోక్షదాయకమే!**

- శ్రీ తులసీదాస్

# శ్రీ గురు పాదాలు

- పళని

ఒకప్పుడు దక్షిణ దేశంలో ఒక సిద్ధపురుషుడైన మహమ్మదీయ గురువూ, మంచి శిష్యుడు ఉన్నారు. ఒక రోజున గురుశిష్యులిద్దరూ మంచి సత్సంగంలో ఉండగా, మక్కా యాత్రకు వెళుతున్న ఒక మహమ్మదీయ మౌల్వీ అక్కడకు వచ్చి, 'మక్కా, కాబాలు దర్శనీయమైన మహాదివ్య క్షేత్రాల'ని అనేక విధాల శ్లాఘిస్తూ అక్కడ ఉన్న శిష్యుణ్ణి కూడా తనతో యాత్రకు రమ్మనమని ప్రోత్సహించాడు.

ఆ ముఖ్యశిష్యుడు అత్యంత కోపావేశంతో ఆ మౌల్వీ తల పట్టుకుని, తన గురు చరణారవిందాల దగ్గరకు వచ్చి, "చూడు! కోట్లకొలది మక్కాలు, కాబాలు యీ చరణాలలో ఉన్నాయి" అని నొక్కి వక్కాణించాడు.

ఇదంతా నిర్మలంగా గమనిస్తున్న గురువుగారు మౌనంగా బయటకి వెళ్ళారు. మౌల్వీకి, ఆ శిష్యునకు ఇంకా వాగ్వివాదం జరుగుతూనే ఉంది. గురువుగారు మళ్ళీ వచ్చి తన ఆసనంపై కూర్చున్నారు. మౌల్వీ గురువుతో శిష్యునిపై ఫిర్యాదు చేశాడు.

గురువు మౌల్వీ చెప్పినదంతా సత్యమేననీ, మక్కా, కాబాలు దర్శనీయమైన క్షేత్రాలనీ చెబుతూ ఆ శిష్యుణ్ణి మౌల్వీతో యాత్రలు చేసిరమ్మనమని చెప్పారు.

శిష్యుడు లేచి నిలబడి చేతులు మోడ్చి, 'గురువు ఆజ్ఞశిరసా వహిస్తాను' అని ప్రయాణమయ్యాడు.

ఆ శిష్యుడు, మౌల్వీ ఓడపై ప్రయాణం సాగిస్తున్నారు. కొంత దూరం వెళ్ళిన తరువాత పెనుతుఫాను చెలరేగింది. ఆ ఓడ ముక్కముక్కలు అయిపోయింది. ఆ శిష్యుడు తప్ప అందరూ మునిగిపోయారు.

ఆ శిష్యుడు ఒక దుంగపై కూర్చుని ప్రాణం దక్కించుకున్నాడు. ఆకాశాన్ని అంటే అలలు ఆ శిష్యుణ్ణి కూడా కబళించాలని చూస్తున్నాయి.

ఇంతలో సముద్రం మధ్యలో నుంచి ఒక హస్తం పైకి వచ్చింది. "నీ చేతిని అందించు. నిన్ను రక్షిస్తాను" అని ఒక అశరీరవాణి వినిపించింది.

శిష్యుడు 'మీరెవరు?' అని ప్రశ్నించాడు.

"నేను మహమ్మద్ ప్రవక్తను" అని జవాబు.

శిష్యుడు 'మహమ్మద్ ప్రవక్త ఎవరో నాకు తెలవదు. నేను గురువును తప్ప మరెవరినీ ఎరుగను' అన్నాడు.

ఆ హస్తం అదృశ్యమైంది. అలలు అతనిని తలకిందులుగా చేసివేస్తున్నాయి. ఇంతలో మరొక హస్తం పైకి వచ్చి "నన్ను పట్టుకో రక్షిస్తాను" అంది.

'ఎవరు నీవు?'

"నేను భగవంతుడను"

'నా గురువే నాకు భగవంతుడు. మరొక భగవంతుణ్ణి నేను ఎరుగను' అని బదులు పలికాడు శిష్యుడు.

కొంతసేపైన తరువాత మరొక హస్తం పైకి వచ్చి, "నేను నీ గురువునకు గురువును. నన్ను నమ్మి నీ చేతిని నాకందివ్వు. నిన్ను కాపాడటానికే వచ్చాను" అంది.

'నేను నా హస్తాన్ని నా గురువు ఒక్కరికే తప్ప మరెవరికీ యివ్వను. మీరెవరైనా అగుగాక! నేను మునిగినా, తేలినా అంతే! నేను నా గురుదేవుడి సహాయంతో తప్ప, నేను మరెవరి సహాయంతోనూ పైకిరాను' అన్నాడు శిష్యుడు.

అప్పుడు ఆ హస్తం కూడా మాయమైపోయింది.

ఇంతలో ఆ శిష్యుని ఎట్టఎదుట ఆ ఉత్తుంగ తరంగాల మధ్యలో అతని గురువు సాచిన హస్తాలతో ప్రత్యక్షమై శిష్యుణ్ణి గాఢాలింగనం చేసుకుని, ఆనందబాష్పాలతో శిష్యుని శిరస్సును అభిషేకించి, ఆకాశ మార్గాన శిష్యుణ్ణి యింటికి తీసుకుని వెళ్ళాడు.

అట్లాగ ఆ శిష్యుడు తన గురుదేవుడు పెట్టిన పరీక్షకు తట్టుకుని నిలబడి గురువుయొక్క అనుగ్రహాన్ని పొంది లోకానికే ఆదర్శప్రాయుడయ్యాడు!!

*గురువుని కేవలం మానవమాత్రునిగా భావించరాదు. భగవానుని దివ్యజ్యోతిని సద్గురువులో దర్శించవచ్చు. సద్గురువే భగవంతునిగా దివ్యపరివర్తన చెందటం ఊహాతీతమైన ఒక అద్భుత లీల! లీలా మానుష రూపం దాల్చిన సద్గురువు తనపట్ల అచంచల విశ్వాసం నిలుపుకున్న వాళ్ళకి సకల శుభాలు అనుగ్రహిస్తాడు. మానవునికి భగవంతునికి మధ్యన అనుసంధాన కర్త సద్గురువే!*

- శ్రీ కాళీబాబు

# దానము

- పాలూరి కాళీప్రసాద్

దానానికి యజ్ఞము, తపస్సులతో సమానమైన స్థానాన్ని ఇచ్చింది భగవద్గీత. బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమాలలో నీవు ఏ ఆశ్రమంలో వున్నా యజ్ఞము, దానము, తపస్సు ఈ మూడూ మాత్రం మానడానికి వీల్లేదు అంటారు గీతాచార్యులు. మనుష్యులను పావనమొనర్చే శక్తి ఈ మూడింటికి ఉన్నదని కూడా చెప్పారు. అలాగే త్రిగుణాత్మకమైన మనస్సుతో కూడిన మానవుడు ఏ గుణం ప్రధానంగా ఉన్నప్పుడు ఎటువంటి రీతిలో దానం చేస్తాడో కూడా చెప్పారు.

అయితే అసలు దానం ఎలా ఇవ్వాలి? దాత మనస్థితి ఏవిధంగా ఉండాలి అని తైత్తిరీయ ఉపనిషత్తు నిర్వచిస్తోంది. **శ్రద్ధయా దేయం, అశ్రద్ధయా దేయం, శ్రియా దేయం, హ్రియా దేయం, భియా దేయం, సంవిదా దేయం.**

**శ్రద్ధయా దేయం** - దానం ఇచ్చేవాడు శ్రద్ధగా ఇవ్వాలి. ఒక దానం అనే కాదు, ఏ పని చేసినా శ్రద్ధాభక్తులతో చేయమని మన ధర్మం బోధిస్తోంది. సాత్విక గుణం ప్రధానంగా కలిగినవాడు దేశ కాల పాత్రతలను ఎరిగి, తనకు ఏమాత్రం తిరిగి ఉపకారం చేయలేని వ్యక్తులకు, దానాన్ని తన కర్తవ్యంగా భావించి చేస్తాడు అని భగవద్గీత బోధిస్తోంది. అదే తామసిక గుణ ప్రధానుడు అసలు ఎందుకు చేస్తున్నాడో, ఎలా చేయాలో తెలియకుండా, దేశం, కాలం, పాత్రతలను చూడకుండా దానం చేస్తాడని చెబుతోంది. ఇక్కడే మనకి చేసేవారిలో శ్రద్ధ ఉందో, లోపించిందో అర్థం అయిపోతుంది.

**అశ్రద్ధయా దేయం** - శ్రద్ధగా దానమివ్వాలని చెప్పిన మరుక్షణంలోనే ఉపనిషత్తు అశ్రద్ధగా దానమివ్వాలని చెబుతోంది. ఇది కొంచెం వింతగానే తోస్తుంది. అయితే ఇందులో అంతరార్థం ఏమిటంటే, ఒక్కసారి నువ్వు ఏదైనా వస్తువు దానమిచ్చావు అంటే, ఇక ఆ వస్తువుపై నీ మనసులో ఎటువంటి మమకారం ఉండకూడదు. ఎవరైనా మనకు చేసిన మేలును జీవితాంతం గుర్తు పెట్టుకోవాలి. అదే మనం ఇతరులకు చేసిన మేలును వెంటనే మర్చిపోవాలి. ఉదాహరణకు మీ వీధి చివరన ఉన్న పేదవాడికి మీ బట్టలు ఇచ్చారనుకోండి. ఆ తరువాత అతను ఆ బట్టలు వేసుకొని కనిపించినప్పుడల్లా 'ఇవి నేనిచ్చిన బట్టలే కదా!' అనే భావన మీ మనసులో రాకూడదు. ఒక అన్నదాన సత్రానికి భూరి విరాళమిచ్చి ఆ మర్నాటినుండి మీ ఇంట్లో వంట మానేసి అందరూ

అక్కడే తింటుంటే అది దానం ఎలా అవుతుంది? అలాగే ఒక గుడికో, బడికో స్థలమో, ధనమో దానమిచ్చి అక్కడ అంతా నా ఆధీనంలోనే వుండాలి, నేను చెప్పినట్టే అన్నీ జరగాలి అని పట్టుబట్టేవాడు దాత ఎలా అవుతాడు?

అందుకనే దానమిచ్చిన ఆ క్షణంలోనే ఆ ద్రవ్యం మీద మనకు అశ్రద్ధ ఏర్పడాలి. దానితో ఎటువంటి సంగం పెట్టుకోకూడదు. ఒక్క కన్యాదానంలో తప్ప మిగిలిన అన్ని దానాలలో **'ఇదం న మమ'** అని చెప్పిస్తారు. అంటే ఒకసారి దానమిచ్చిన వస్తువుతో ఇక నీకు ఎటువంటి సంబంధం ఉండకూడదు. అయితే కుమార్తెను మాత్రం దానమిచ్చినా ఆమె ప్రేమానురాగాలపై మనకు హక్కు ఉంటుంది. ఆమెకు ఏ కష్టమొచ్చినా కలుగజేసుకొనే హక్కు ఉంటుంది. అయితే హక్కు ఉంది కదా అని ఏ తల్లిదండ్రులూ తమ కూతురి సంసారంలో నిరంతరం కలుగ జేసుకోవాలని, ఆమెపై ఆధారపడాలని కోరుకోరు కదా! మరి హక్కు వున్న దానం విషయంలోనే ఇంత విరాగం ఉన్నప్పుడు, **'ఇది ఇంక నాది కాదు'** అని చెప్పి దానమిచ్చిన వస్తువుపై శ్రద్ధాసక్తులు పెంచుకోవడం ధర్మం కాదు కదా!

ఎందరో అధర్మపరులైన రాజులను సంహరించి తాను పొందిన రాజ్యమంతా కశ్యప మహర్షికి దానమిచ్చేశానని, కనుక అత్యవసరమైనప్పడే ఈ నేలపైకి వస్తానని, వచ్చినా చీకటి పడిన తరువాత తాను ఇక్కడ ఒక్కక్షణం కూడా ఉండలేనని పరశురాముడు శ్రీరామునికి చెప్పడం మనం రామాయణంలో చూస్తాం. తనదైన వస్తువుని దానమిస్తేనే దానిమీద హక్కును వెంటనే పోగొట్టుకోవాలని మన ఆర్షధర్మం బోధిస్తూ ఉంటే అసలు తమది కాని ప్రజల సొమ్మును వారికే పంచిపెట్టి, దానిమీద తమ పేరు, బొమ్మ ముద్రించుకొనే వారి గురించి మాట్లాడుకోవటానికి ఏముంటుంది. అసలు ఇలాంటి వ్యక్తులు వుంటారని గీతాచార్యులు కూడా ఊహించి ఉండరు. అందుకే సత్వరజస్తమో గుణ దాతల నిర్వచనంలో కూడా ఎక్కడా ఇటువంటి వారి ప్రస్తావన తేలేదు.

**శ్రియా దేయం** - నీ స్తోమతకు తగిన రీతిలో నువ్వు దానం చెయ్యాలి. వెనకటికి ఒకడు తనకున్న సెంటు భూమిలో తోటకూర పండించి ఆ దారిన వచ్చేపోయేవారికి ఆ తోటకూర పంచిపెట్టేవాడు.

అలా తనకున్న దానిలో అధికభాగం దానమిచ్చిన పుణ్యవశాన మరుజన్మలో అతడు రాజుగా పుట్టాడు. అయితే పూర్వజన్మ స్మృతి కూడా కొంత కలిగింది. 'ఆ జన్మలో కొద్దిగా తోటకూర దానమిచ్చి ఈ జన్మలో రాజునయ్యాను కదా! ఇప్పుడు చాలా తోటకూర దానమిస్తే ఇంకెంత గొప్ప జన్మ వస్తోందో!' అనుకొని ఎకరాల కొద్దీ తోటకూర పండించి దానమివ్వడం మొదలుపెట్టాడు. రాజుగారు తోటకూర దానమివ్వడ మేమిటని లోకమంతా విచిత్రంగా చెప్పకోవడం మొదలు పెట్టింది. ఒకనాడు ఒక మహాత్ములు అటుగా వెళ్తూ ఆ రాజును చూసి **'అంతకు ఇంతయ్యింది కానీ ఇక ఇంతకు ఇంతే!'** అన్నారు. ఆ రాజుకు విషయం అర్థం కాక వివరించమని ఆ మహాత్ముని ప్రార్థించాడు. 'ఆ జన్మలో నువ్వు ఒక చిన్న రైతువి. నీ స్తోమతను బట్టి తోటకూర దానమిచ్చావు. ఆ పుణ్యవశాన రాజువయ్యావు. ఇప్పుడు రాజుగా రత్నరాశులు, మణి మాణిక్యాలు, అగ్రహారాలు దానమివ్వవలసిన స్థితిలో ఉన్న నువ్వు నీ స్తోమతను మరచిపోయి ఇంకా తోటకూరే దానమిస్తే అది నీకు ఎటువంటి ఉన్నతిని కలుగజేయదు' అని వివరించారు ఆ మహాత్ములు.

**హ్రియా దేయం** - సిగ్గుతో దానమివ్వాలి. 'అయ్యో! ఇంతకు మించి ఇవ్వలేక పోతున్నానే' అని సిగ్గుపడుతూ దానమివ్వాలి తప్పితే 'నేను కాబట్టి ఇంత గొప్ప గొప్ప దానాలు చేస్తున్నాను. అందరూ నన్ను గౌరవించాలి' అనే డంబంతో, అహంకారంతో దానమివ్వకూడదు. పూర్వం సంత్ రహీమ్ అని గొప్ప భక్తుడు, కవి ఉండేవారు. ఆయన రోజంతా తన ఇంటి బయట కూర్చొని ఎంతో మందికి తనకున్న కొద్దిపాటి సంపదనంతా దానమిస్తూ ఉండేవారు. అయితే అలా దానమిచ్చేటప్పుడు తల వంచుకొని సిగ్గుపడుతూ దానమిచ్చేవారు. ఒకసారి ఈ విషయం తులసీదాసు వారికి తెలిసి 'చేసేది మంచి పని అయినప్పుడు తల ఎత్తుకొని చేయక అలా తల దించుకొని ఎందుకు దానమిస్తున్నారు?' అని ఒక చీటీపై వ్రాసి పంపించారు. అందుకు రహీమ్ సమాధానమిస్తూ 'ఇచ్చేవాడు వేరే ఉన్నాడు. ఆయన నా ఈ చేతులతో ఇప్పించడానికై అహోరాత్రాలూ నాకు సంపదనిస్తున్నాడు. ఈ జనులే తెలియక నేనిస్తున్నానని భ్రమ పడుతున్నారు. అందుకే తల దించుకొని ఇస్తున్నాను' అని వినయంగా వ్రాశారు.

**(తరువాయి భాగము 41వ పేజీలో ..................................)**

# శబ్ద స్వరూపుడు హనుమ

- భాగవతుల జయప్రద

"హనుమ" ఒక మంత్రస్వరూపుడు. 'హనుమ" శబ్దస్వరూపుడు. అసలు శబ్దము దేని ద్వారా వచ్చింది? వేదము ద్వారానే కదా! వేదాలకు నిరూపణలు ఏమిటి? వైకుంఠంలో ఉండే శ్రీమహావిష్ణువుకి గరుత్మంతుడు వాహనం. ఇంకో ఆయనకి (శివుడికి) వృషభం (నందీశ్వరుడు) వాహనం, మరి ఆంజనేయుడు? శ్రీరామునికి వాహనం. ఏమిటీ వాహనాలు? ఈ వాహనాల ద్వారా ఆ వేదములను మనకి నిరూపణములుగా చూపిస్తున్నారు. వేదము చేత అధిరోహింపబడి మన దగ్గరకి వచ్చేవాడు భగవంతుడు. భగవంతుడు కావాలన్నప్పుడు ఒక మంత్రమును మనము ఆశ్రయిస్తాము. ఆ మంత్రమును మనస్సు లోపల భావన చేస్తే ఆ భగవంతుడు దానిని ఎక్కి మన లోపలికి వస్తాడు. అటువంటి వాహనమే "శబ్దము". శబ్దమును మనవారు వృషభముగా, గరుత్మంతుడుగా నిరూపించారు. అందుచేతనే శివాలయములో నందీశ్వరుడు ఉంటాడు, విష్ణు ఆలయములో గరుత్మంతుడు ఉంటాడు. అంటే ఆ వేద స్వరూపుడు అయినటువంటి గరుత్మంతుడి మీద విష్ణుమూర్తి వస్తాడు అని, విష్ణు ఆలయములో చూపిస్తారు.

వృషభము కూడా వేద స్వరూపమే. శబ్దమనే వృషభాన్ని అధిరోహించి పరమేశ్వరుడు వస్తాడు గనక ఆయన్ని సేవించడానికి ముందు ఈ వృషభాన్ని సేవించాలి. శివాలయానికి వెళితే కొమ్ములపైన వేళ్ళు పెట్టి, ఆ మధ్యలోంచి శివుణ్ణి దర్శించాలి. వృషభానికి నాలుగు కొమ్ములు. రెండు కొమ్ములు బయటికి కనిపిస్తాయి, రెండు లోపల వుంటాయి. అదేమిటి నాలుగు కొమ్ములు ఏమిటి నందీశ్వరునికి? అంటే... ఇప్పుడు మనకు వినిపించే శబ్దము ఒకటి అయితే, ఆ శబ్దాన్నే కొంచెము మెల్లగా అనుకుంటే, లోపల వినిపించే శబ్దము ఇంకోటి ఉంటుంది, ఇవి రెండు శబ్దములున్నాయి (ఇవే పైన కనిపించే రెండు కొమ్ములు). .ఇవి కాక ఇంకో రెండు ఉన్నాయి. నాభి ప్రదేశములో ఒక శబ్దము, నాభి క్రింద ఇంకో శబ్దము ఉన్నాయి. నాభి కిందనున్న ఆ శబ్దము ఎవ్వరికి వినిపించదు. "నిర్వికల్పసమాధి"లో ఉన్న యోగులు మాత్రమే దానిని

శ్రవణం చేయగలుగుతారు. దానికి "పరా" అని పేరు. ఇదే మనకి శ్రీ లలితా సహస్రనామములో చెప్పబడినది

**పరాప్రత్యక్చితీరూపా పశ్యన్తీ పరదేవతా**
**మధ్యమా వైఖరి రూపా భక్తమానస హంసికా**

**పరా** అంటే పరాస్థితిలోని వాగ్రూపము, **ప్రత్యక్చితీరూపా** - స్వస్వరూపము యొక్క జ్ఞానమే స్వరూపముగా గలది అని అర్థము. **పశ్యన్తి** - రెండవస్థితిగా వ్యక్తం కాబోయే వాక్కు. **పరదేవతా** - పశ్యంతీ వాక్కు యొక్క సూక్ష్మరూపము. **మధ్యమా** - పశ్యంతీ, వైఖరీ వాక్కులకు మధ్య వుండు స్థితికి సంబంధించిన వాక్కు. **వైఖరీరూపా** - స్పష్టముగా వ్యక్తమైన వాక్కు. **భక్తమానస హంసికా** - భక్తుల యొక్క మనస్సులందు విహరించు హంస. దీనినే కొంచెము విశ్లేషణ చేసుకుంటే, నాభి స్థానమునకు వచ్చినప్పుడు వచ్చేటువంటి శబ్దమునకు **పశ్యన్తి** అని పేరు. (ఇదే రెండవస్థితిగా వ్యక్తం కాబోయే వాక్కు) దీనిని **సవికల్ప సమాధిలో** ఉన్న యోగులు మాత్రమే వినగలుగుతారు. అక్కడనుండి పైకి వచ్చిన తర్వాత, మెల్లగా లోపల అనుకున్నట్టుగా (ఉచ్చరిస్తున్నట్టుగా), మన చెవికి వినపడే శబ్దము ఏదైతే ఉందో ఆ ధ్వని **మధ్యమా** (పశ్యంతీ, వైఖరీ వాక్కులకు మధ్య వుండు స్థితికి సంబంధించిన వాక్కు) అని అన్నారు. దేనినైతే, మన నాలుక, పెదవులు, దంతములు, ఒకదానితో ఒకటి రాపిడి చెంది లోపలినుండి వచ్చే గాలికి తగిలి, ధ్వనులుగా బయటికి పంపిస్తే ఆ వచ్చే దాని పేరు **వైఖరి**. ఈ వైఖరి అనే శబ్దమే మనకి వినపడుతుంది. మన మటుకు మనకి వినిపించేది **మధ్యమా**. మధ్యమా, వైఖరి మాత్రమే సాధారణ మనుషులకు వినిపించే శబ్దాలు. ఆ శబ్దములే వృషభానికి పైన ఉన్న రెండు కొమ్ములు. వాటి మీద చెయ్యిపెట్టి, లోపలనున్న భగవంతుని చూడాలి. ఆ వేదపురుషుడి అనుగ్రహము ఉన్నవారు లోపలికి వెళ్ళేసరికి ఆ పరమేశ్వరునియందు లీనము అవుతారు.

మరి ఆంజనేయుడు కూడా స్వామి రామచంద్రునికి వాహనమే కదా? మరి ఆయన ఎలా శబ్ద స్వరూపుడు అయినాడు? లోపల వున్నటువంటి **పరా** శబ్దములు (యోగులు దేనినైతే వినగలరో) అవి కంఠసీమను దాటి, పైన అంగిలి నుండి కొన్ని అక్షరాలు, నాలుక నుండి కొన్ని అక్షరాలు, దవడల నుండి కొన్ని అక్షరాలు, దంతములు నుండి కొన్ని అక్షరాలు, పెదవుల నుండి కొన్ని అక్షరాలు, ఇలాగ మనకి అక్షర

సముదాయం వస్తోంది. ఇదంతా ఒక శబ్దము ద్వారానే వస్తోంది కదా. ఈ శబ్దమే **హనుమ**. వాయువు వలన పుట్టిన వాడు వాయునందనుడు. వాయువు వలన పుట్టింది శబ్దము. అందువలన శబ్దస్వరూపుడు "హనుమ" అయినాడు.

తైత్తిరీయోపనిషత్తులోని **ఓం శన్నో మిత్రశ్శం వరుణః। శన్నో భవత్వర్యమా। శన్న ఇన్ద్రో బృహస్పతిః। శన్నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారం। ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః॥** పైన చెప్పబడిన శాంతి మంత్రములో, బ్రహ్మమునకు నమస్కారము వాయువుకి కూడా (పురుషుని శ్వాస)కి నమస్కారములు అని చెప్పబడినది. అందువలన చెప్పేవానిని రక్షించాలి, చెప్పకునే నన్ను రక్షించాలి అని వాయువుని కూడా ప్రార్ధిస్తే గాని నోట మాట పలకడానికి వీలు లేదు .

**హనుమ** అంటే దవడ, అది కదిలింది కాబట్టి **హనుమాన్** అయినాడు. క్రింద ఉన్న **పరా** స్వరూపము నుండి బయలుదేరి, పైన వుండే ఆ దవడలకు, నాలుక తగలటం చేత వాయువుని అదిమిపట్టి మెల్లగా వాడటం చేత అక్షరములు వస్తున్నవి గనుక మనకి అక్షరములు అభివ్యక్తమవుతున్నాయి. వ్యక్తము చేసేటువంటిది ఏదైతే వుందో, దానిని **అంజన** అని అన్నారు. అంజనా దేవి ఆంజనేయుని తల్లి. తండ్రి వాయువు. వీరి ఇరువురి కలయిక చేత పుట్టినవాడు హనుమ. అందువలన "హనుమ" శబ్దస్వరూపుడు అయినాడు. ఆ శబ్దము మనకి వినపడే శబ్దము కాదు. నిర్వికల్ప సమాధిలో ఉన్న మహాపురుషల నిశ్వాసము, శబ్దరూపములో నుండి బయటకి వచ్చిందే వేదము. అటువంటి వేదమే **హనుమ**. అంటే వేదమును అధికరించినటువంటి మహా పురుషులే హనుమత్స్వరూపులు. ఆయన మన శ్రీ గురుదేవులు **శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబు.**

శ్రీగురుదేవులే హనుమత్స్వరూపము అని మనలో ఎందరికో ప్రత్యక్ష అనుభవము. అందులన వారియొక్క అమృతవాక్కులనబడే శబ్దములు మనకు మంత్రోపదేశములు అని మనము గ్రహించాలి. దీనికి భావార్ధమే **మంత్రమూలం గురోర్వాక్యం.**

# శ్రీ శివ దర్శనం

సేకరణ - సి. బాబ్జి

ఒక సారి ఒక శివభక్తుడు తన ఊరినుండి కేదారనాథ్ ధామానికి యాత్రకోసం బయలుదేరాడు. అప్పట్లో యాత్రాసాధనాలు, ప్రయాణ సౌకర్యాలు లేనందున, అతడు నడక ద్వారానే పయనించాడు. దారిలో ఎవరు కలిస్తే వారిని కేదారనాథ్ మార్గం అడిగేవాడు. మనసులో శివుని ధ్యానిస్తూ ఉండేవాడు. అట్లా నడుస్తూ నడుస్తూ నెలలు గడిచిపోయాయి. చివరకు ఒక రోజు అతడు కేదారధామం చేరనే చేరాడు. కేదారనాథ్‌లో మందిరం ద్వారాలను ఆరు నెలలే తెరుస్తారు, ఆరు నెలలు మూసి ఉంచుతారు. అతడు మందిరం ద్వారాలు మూసే వేళ అక్కడకు చేరాడు.

పూజారికి అతడు ఆర్తితో చెప్పాడు 'నేనెంతో దూరం నుంచి పాదయాత్ర చేస్తూ వచ్చాను కృప ఉంచి తలుపులు తీయండి. ఈశ్వరుని దర్శించనివ్వండి' అని. కానీ అక్కడ నియమం ఏంటంటే ఒకసారి తలుపును మూస్తే ఇక మూసినట్టే. నియమం నియమమే, మరి అతడు చాలా దుఃఖపడ్డాడు. మాటిమాటికీ శివుని స్మరించాడు. 'ప్రభో, ఒకే ఒక్కసారి దర్శనం ఇవ్వవా?' అని అతడు అందరిని ఎంత ప్రార్థించినా, ఎవరూ వినలేదు. పూజారి అన్నాడు కదా 'ఇహ ఇక్కడకు ఆరు నెలలు గడిచాక రావాలి, ఆరునెలలు అయ్యాకే తలుపును తెరిచేది' అని 'ఆరు నెలలపాటు ఇక్కడ మంచు కురుస్తుంది' అని చెప్పి అందరూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

అతడక్కడే ఏడుస్తూ ఉండిపోయాడు, ఏడుస్తూ ఏడుస్తూ రాత్రి కాసాగింది. నలుదిక్కులా చీకట్లు కమ్మిపోయాయి కానీ అతడికి విశ్వాసం తన శివుని మీద ఆయన తప్పక కృప చూపుతాడని. అతడికి చాలా ఆకలి, దప్పిక కూడా కలగసాగాయి. అంతలోకి అతడు ఎవరో వస్తున్న శబ్దాన్ని విన్నాడు. చూస్తే ఒక సన్యాసి బాబా అతని వైపు వస్తున్నాడు. ఆ సన్యాసి బాబా అతడి వద్దకు వచ్చి దగ్గరలో కూర్చున్నాడు. 'నాయనా, ఎక్కడినుంచి వస్తున్నావు?' అని అడిగాడు. అతడు తన కథంతా చెప్పాడు. చెప్పి, 'నేను ఇంత దూరం రావటం వ్యర్థం అయింది బాబాజీ' అని బాధపడ్డాడు. బాబాజీ అతడిని ఓదార్చి, అన్నం తినిపించాడు, తరువాత చాలా సేపటివరకు బాబాజీ అతడితో మాట్లాడుతూ ఉండిపోయాడు. బాబాజీకి అతడిపై దయ కలిగింది. ఆయన 'నాయనా, నాకు రేపు ఉదయం మందిరం తప్పక తెరుస్తారని అనిపిస్తున్నది, నీకు తప్పక దర్శనం దొరుకుతుందని అనిపిస్తున్నది' అని అన్నాడు.

మాటల్లో పడి ఆ భక్తుడికి ఎప్పుడు కన్ను అంటిందో తెలియదు. సూర్యుడు కొద్దిగా ప్రకాశించేవేళకు భక్తుని కళ్ళు తెరుచుకున్నాయి. అతడు అటూ ఇటూ చూస్తే

బాబాజీ చుట్టుపక్కల ఎక్కడా లేడు. అతడికి ఏదైనా అర్థమయ్యే లోపు పూజారి తమ మండలి అంతటితో కలిసి రావటం చూశాడు. అతడు పూజారికి ప్రణామం చేసి అన్నాడు 'నిన్ననేమో మీరు మందిరం ఆరునెలలాగి తీస్తామన్నారు కదా? ఈ మధ్య సమయంలో ఎవరూ ఇటు తొంగి చూడరని కూడా చెప్పారు కదా. కానీ మీరు ఉదయాన్నే వచ్చేశారే?' అని అన్నాడు. పూజారి అతడి వంక పరిశీలించి చూస్తూ, గుర్తు పట్టటానికి ప్రయత్నిస్తూ, అడిగాడు 'నువ్వు మందిరం ద్వారం మూసేసే వేళకు వచ్చినవాడివే కదా? నన్ను కలిశావు కదా ఆరునెలలయ్యాక తిరిగి వచ్చావా!' అని అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు అన్నాడు ఆశ్చర్యంగా 'లేదు, నేనెక్కడికీ పోనేలేదే. నిన్ననే కదా మిమ్మల్ని కలిసింది, రాత్రి నేను ఇక్కడే పడుకున్నాను నేనెటూ కదలలేదు' అని చెప్పాడు.

పూజారికి ఆశ్చర్యానికి అంతే లేదు. ఆయన అన్నాడు 'కానీ నేను ఆరునెలల ముందు మందిరం మూసి వెళ్ళిపోయాక ఇదే రావటం. నీవు ఆరు నెలలు పాటు ఇక్కడ జీవించి ఎట్లా ఉండగలిగావు?' పూజారి, అతడి బృందం అంతా విపరీతంగా ఆశ్చర్యపోయారు. ఇంత చలిలో ఒక వ్యక్తి ఒంటరిగా ఆరునెలల పాటు జీవించి ఎట్లా ఉండగలడు? అప్పుడు ఆ భక్తుడు ఆయనకు ఆ సన్యాసి బాబా రావటం, కలవటం, ఆయనతో గడిపిన సమయం, విషయం అంతా వివరించాడు. 'ఒక సన్యాసి వచ్చాడు- పొడుగ్గా ఉన్నాడు, పెద్ద గడ్డం, జటలు, ఒక చేతిలో త్రిశూలం మరొక చేతిలో డమరుకం పట్టుకుని, మృగచర్మం కప్పుకుని ఉండినాడు' అని. వెంటనే పూజారి, ఇతరులు అందరూ అతడి చరణాలపై పడిపోయారు. ఇట్లా అన్నారు 'మేము జీవితమంతా వెచ్చించాము, కానీ ఈశ్వరుని దర్శనం పొందలేకపోయాము, నిజమైన భక్తుడివి నీవే నీవు సాక్షాత్తు భగవంతుడినే, శివుడినే దర్శనం చేసేసుకున్నావు' అన్నారు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***జులై 2024 :*** AS 3702, 5744, 6587, 8150, 8155, 8156, 8158; LM 4450; PK 0019, 0021, 0022, 0024, 0026

***ఆగస్ట్ 2024 :*** AS 7790, 7795, 8344, 8347, 8831, 9115, 9222 - 9225; LM 4456, 4457; PK 0028, 0029, 0031

# రథసప్తమి - జిల్లేడాకు

సేకరణ - లలిత. వి

రథసప్తమికి జిల్లేడాకుకి సంబంధం ఏమిటి ?

రథసప్తమినాడు స్నానసమయంలో నెత్తిపై జిల్లేడాకు పెట్టుకోవాలి. ఆ ఆకునే ఎందుకు పెట్టుకోవాలి? ఏ తమలపాకో ఎందుకు పెట్టుకోకూడదు అన్నసందేహమూ వస్తుంది.

దీని వెనుక ఒకకథ ఉంది. పూర్వం అగ్నిష్వాత్తులు అనే పండితులు మహానిష్ఠతో చాలా యజ్ఞాలు చేశారు. ఆ యజ్ఞాలతో పరమాత్మ తృప్తి చెంది, వాళ్ళని స్వర్గానికి తీసుకురండని దేవవిమానం పంపించాడు. ఆ సమయానికి యజ్ఞాంతంలో పూర్ణాహుతి చేస్తున్నారు అగ్నిష్వాత్తులు. ఆ దేవవిమానం చూసిన సంభ్రమంలో వారు ఆవునేతితో కూడిన హెూమద్రవ్యాన్ని కంగారుగా వేశారు. అయితే ఆసమయంలో పెద్దగాలి రావడంతో కొంత వేడివేడి నెయ్యి ప్రక్కనే ఉన్న ఒకమేకపై పడింది. ఆ వేడికి మేకచర్మం ఊడిపోయి మరణించి, దాని ఆత్మ వీరికంటే ముందుగా వెళ్ళి దేవవిమానంలో కూర్చుంది. ఆచర్మం ప్రక్కనే ఉన్న ఒక చెట్టుపై పడింది. అప్పటి నుండి ఆ చెట్టు మూలతత్త్వం మారిపోయి, మెత్తని ఆకుల్ని ధరించిన జిల్లేడు చెట్టుగా మారిపోయింది.

అలా జిల్లేడాకు యజ్ఞాంత సమయంలో ఆజ్యధారలు ధరించడంతో పరమపవిత్రం అయ్యింది. జిల్లేడు ఆకును ముట్టుకొంటే మేకచర్మంలా మెత్తగా ఉంటుందందుకే! జరిగిన దానికి అగ్నిష్వాత్తులు బాధపడ్డారు. అప్పడు ఆకాశవాణి, “మీరు దుఃఖించాల్సిన పనిలేదు. మీరు చేసిన యజ్ఞఫలం ఆ మేకకు కూడా దక్కి, దుర్లభమైన స్వర్గప్రాప్తి కలిగింది. ఈ జిల్లేడు మేకచర్మ స్పర్శతో పవిత్రమై అర్కవృక్షంగా అనగా పూజింపదగినదిగా మారింది” అని పలికింది. ఆ మాట అగ్నిష్వాత్తుల్ని సంతోషపరిచింది. అది మాఘశుద్ధ సప్తమీ తిథి.

అప్పటి నుండి రథసప్తమినాడు నెత్తిపై జిల్లేడాకు పెట్టుకుని, సూర్యప్రీతి కోసం స్నానం చేసేవారికి లేశమాత్రం యజ్ఞఫలం లభిస్తోంది. ఏడుజన్మల పాపాలు పోతున్నాయి.


అక్షరాభ్యాసం
ముకుంద్
రమణ! A, B, Cలు వ్రాయి!
ABC
1
బాబూ! మీరు చాలా జ్ఞానవంతులు, కానీ మీ జ్ఞానాన్ని దేశదేశాలలో పంచాలంటే ఆంగ్లము నేర్చుకోవాలి. నేను నేర్పిస్తాను, రండి.
ABC
2


నాన్న గారు! నేను అమ్మ సృష్టిని. అమ్మ ఎలా నడిపిస్తే అలా నడుస్తాను.
A B C
3
కానీ వేరే దేశానికి వెళ్ళినప్పుడు ఆంగ్లము లేకుండా జ్ఞానాన్ని పంచలేవు కదా! పలక తీసుకుని దానిమీద ఉన్న అక్షరాలని దిద్దు!
4


ఏంటి బాబు? దిద్దండి!
A B C
నాన్న గారూ! దిద్దుదామ్మంటే పలక లోన్నూ, బలపం లోనూ! అమ్మ కనబడుతోంది!
అది మంచిదే కదండీ బాబు! దిద్దండి.


ఏమయ్యింది బాబూ! చెయ్యిని వెనక్కి లాగేశారేమిటి?!
7


నేను రాద్ధామంటే అమ్మవారు పలకలోంచి మందహాసం చేస్తూ "అన్ని విద్యలకు అధిపతి అయిన నేనుండగా నీవు వేరే విద్య నేర్చుకోవడమెందుకు?" అన్నారు!
తప్పు నాదే బాబూ! మీ అసలు స్వరూపం మర్చిపోయి మీకే విద్య నేర్పాలని అనుకున్నాను.
8

# శ్రీ దాసశేష స్వామి

సేకరణ - మురళీ

1890వ సం. మార్చి 20న గుంటూరు జిల్లా యామర్రు గ్రామంలో జన్మించారు సుబ్బారావు. తండ్రి యామర్తి బొల్లయ్య, తల్లి లింగమ్మ. ప్రత్తిపాడులోని మాతామహుల ఇంట ఉండి ప్రాథమిక విద్య, గుంటూరులో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. తన 25వ ఏట శ్రీహరితో వివాహం అయ్యింది. కొంతకాలం పంగిడిగూడెం జమీందారు వద్ద ఉద్యోగం చేసి స్వగ్రామం తిరిగి వచ్చి కరణీకం చేశారు. కరణీకంతో బాటు గ్రామంలోని శివాలయం, ఊరి చెఱువు యాజమాన్యం సమర్ధవంతంగా నిర్వహించి మంచి పేరు గడించారు.

చిన్నప్పటినుంచి భగవద్భక్తి, భక్తులయెడ ప్రేమానురాగాలు, రామాయణ భాగవత పారాయణం, భక్త చరిత్రల పఠనా వ్యాసంగం గల సుబ్బారావులో వైరాగ్యం దినదిన ప్రవర్ధమానమయ్యింది. తన యిష్ట దైవం శ్రీరామచంద్ర ప్రభువుని తనను సంసార బంధములనుండి విముక్తుడిని చెయ్యమని ప్రార్ధించేవాడు. **"భద్రగిరిధామ శ్రీరామ భవవిరామ"** అనే మకుటంతో రాములవారిపై భక్తిరస భరితమైన శతకం రచించి, కాలినడకన భద్రాచల యాత్ర చేసి పునర్వసు నక్షత్రంలో శ్రీ రాముల వారికి సమర్పించారు. శ్రీరామచంద్ర ప్రభువు సుబ్బారావు ప్రార్ధనను త్వరగానే మన్నించాడేమో, ఒక సంవత్సరంలోపే భార్యా వియోగం కలిగి, సంసార బంధాలనుండి విముక్తి పొంది సంపూర్ణ విరాగి అయ్యారు.

సుబ్బారావు సాధుసంతుల దర్శనం, పుణ్యక్షేత్ర దర్శనం తరచు చేస్తుండేవారు. ఒక పర్యాయం సమీపంలోని వంగిపుర గ్రామానికి వెళ్ళినప్పుడు శ్రీ చిదానంద సరస్వతీ స్వామివారి దర్శనం, బోధ లభించాయి. స్వామివారు సుబ్బారావులోని భక్తి భావన గుర్తించి గాయత్రీ ఉపాసన, భగవద్గీతా పారాయణ చెయ్యమని చెప్పారు. అక్కడికి కలకత్తా నుంచి వచ్చిన గౌరవానంద స్వామి వద్ద అనేక వేదాంత రహస్యములు తెలుసుకున్నారు. అక్కడి దేవాలయంలో జరిగే భగవద్గోష్టులలో, భజనలలో పాల్గొంటూ, నృత్యం, సంకీర్తన చేస్తూ వంగీపురంలోనే ఎక్కువ కాలం గడిపేవారు. ఆ సమయంలోనే **"కృష్ణా మన్మనోవల్లభా"** అనే మకుటంతో మరొక శతకం వ్రాసారు.

శ్రీ వాసుదాస గోస్వామి గుంటూరు మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ రామతారకం ప్రచారం చేస్తూ, "శ్రీ కోదండరామ సేవక ధర్మ సమాజం" లో సభ్యులను చేర్పిస్తూ వంగిపురం చేరుకున్నారు. సుబ్బారావు శ్రీ వాసుదాస గోస్వామిని ప్రార్థించి వారివద్ద ఉపదేశం పొందారు. సుబ్బారావు స్వగ్రామం వెళ్ళి కరణీకం, మందిర తటాక కర్తృత్వ బాధ్యతలను త్యజించి, గురువుగారితో పర్యటనకు వెళ్ళిపోయారు. గురువుగారికి శుశ్రూషలు చేస్తూ, వారి బోధలు వింటూ, సాధనలో ఆనందానుభూతిని పొందేవారు. సుబ్బారావుకు గురువులయందు అమితమైన భక్తి, ప్రేమ పెంపొందాయి. గురువులను స్తుతిస్తూ **'వందనశతి'**, **'తులసీదళములూ'** పేరుతో అనేక కీర్తనలు రచించి గురువులకు అర్పించారు. సుబ్బారావు సాధనకు సంతుష్టులై, శ్రీ వాసుదాస గోస్వామివారు పంచసంస్కారాలు చేసి **"దాస శేషస్వామి"** అనే నామం ప్రసాదించారు.

గురువుగారు భక్తి, జ్ఞాన, వైరాగ్యములు ప్రబోధిస్తూ 1929 నుండి ప్రచురిస్తున్న **"భక్తి సంజీవని"** మాసపత్రిక బాధ్యతను దాస శేషస్వామికి అప్పగించారు. వీరి సారధ్యంలో మాసపత్రిక దినదినాభివృద్ధి చెందింది. శ్రీ వాసుదాస స్వామి గురువులు శ్రీమద్రామాయణ వ్యాఖ్యానం మందరం రచిస్తున్నప్పుడు ఆ కార్యంలో దాస శేషస్వామి సేవ శ్రీరామ కార్యంలో హనుమత్సేవ వంటిదయ్యింది. దాస శేషస్వామి తమ గురువులతో గుంటూరు జిల్లా, నడిగడ్డపాలెంలో **"శ్రీ వాల్మీకాశ్రమం"** ఏర్పాటు చేయించారు, ఇందులో శ్రీ గురుపాదుకలు ప్రతిష్ఠించి **"పాదుకా క్షేత్రం"** అని పేరుపెట్టారు.

శ్రీ వాసుదాస స్వామి 1936వ సం.లో బ్రహ్మీభూతులైన తరువాత ఆశ్రమాధిపత్యం వహించి గురుస్థానం అలంకరించారు. ఆశ్రమాధిపతిగా ధనం చేతితో తాకలేదు. ఆస్తులు పెరిగితే అంతస్తులు పెరిగి పారమార్థికం తగ్గిపోతుందని ఆశ్రమానికి స్థిర చరాస్తులేమీ సముపార్జించలేదు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 8: **నిరోధస్తు లోక వేద వ్యాపార న్యాసః** లోకవేద వ్యాపారమును (లౌకిక మైన మరియు వైదిక పరమైన కర్మలను) భగవానుని చెంత వుంచడమే నిరోధము. ముందుగా ఏడవ సూత్రంలో చెప్పబడిన "**నిరోధము**" అన్నదాని వివరణను నారదులు ఈ సూత్రము ద్వారా ఇస్తున్నారు.



మామూలుగా నిరోధము అంటే అడ్డుకొనడము అన్న అర్థమును తీసుకుంటాము. కానీ ఇంద్రియములను బలవంతంగా తొక్కి పట్టి అదుపులో పెట్టుకొనడానికి ప్రయత్నిస్తే "**బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి**" అని చెప్పబడినట్లు అవి తిరిగి వాటి ప్రతాపాన్ని చూపిస్తాయి. రావణుడు మొదలగు వారు ఇంద్రియ నిగ్రహముతో భగవత్ సాక్షాత్కారము పొందినప్పటికీ చివరికి వాటికి దాసోహమని నశించడం మనందరికీ తెలిసిన విషయమే. శ్రీ బాబూజీ మహారాజ్ వారు ఇంద్రియాలను తొక్కి పట్టరాదని కేవలము విచారణ మరియు వివేకము ద్వారా మాత్రమే వాటిని నియంత్రించగలమనీ తెలియజేశారు.

నారదుల వారు నిరోధమంటే లోక వేద వ్యాపారములను సన్యసించడమని తెలియచేస్తున్నారు. అంటే లోకవేద వ్యాపారములను మానమని చెప్పడము దీని భావము కాదు. వ్యాపారమనగా కర్మ అని అర్థం. లౌకిక పరమైన వ్యవహారములను లోక వ్యాపారములుగా, నిత్య నైమిత్తిక కామ్య కర్మలను వేద వ్యాపారములుగా గ్రహించాలి. మరి న్యాసము అంటే వాటిని వదలివేయడమని కాక వాటిని భగవదర్పణ భావముతో చేయడమే. "**న్యాసో నామ భగవత్ సమర్పణం**" అని చెప్పబడినది. అంటే ఆ వ్యాపారములు భగవంతునికి సమర్పించినప్పుడు అవి మనని కూడా పట్టుకొని బంధించవు.

దేహమున్నంతవరకు వ్యవహారం తప్పదు. కాకపోతే సామాన్యుడి వ్యవహారము అహంకార ప్రేరితమై నేను నా కొరకు చేస్తున్నానన్న

భావనతో ఉంటుంది. మరి భక్తుని వ్యవహారము భగవత్ ప్రేరితమై వుండి ప్రతి పనినీ ఈశ్వర సమర్పణ భావంతో చేస్తాడు. గీతాచార్యులు భగవద్గీతలో కర్మలను యజ్ఞం అన్న భావనతో చేయవలెనని బోధిస్తూ

**"యజ్ఞార్థాత్ కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర"**

అంటూ కర్మలను భగవదర్పితములుగా చేసినప్పుడు అవి బంధించక పోవడమే కాక ముక్తసంగులు అవుతామని వివరించారు.

శ్రీ బాబూజీ మహారాజ్ వారు సన్యాసము అంటే అన్నీ వదిలి కాషాయ వస్త్రాలు ధరించడం కాదని మనసు సన్యసించాలని, సత్య స్వరూపుడైన గురుదేవుల పాదముల చెంత నిరంతర ధ్యానం నిలిపి ఉండడమే అసలైన సన్యాసమని వివరించారు. దీనికి ఎంతో ప్రయాస అవసరం లేదనీ ఒక చేతిని గురుదేవుల పాదములపై వుంచిన భావనతో అన్ని పనులనూ ముగించి తిరిగి మరొక చేతిని కూడా ఆ పాదములపై చేర్చాలనీ అప్పుడది నిష్కామ కర్మ అవుతుందని శ్రీ బాబు వివరించారు.

గీతాచార్యులు కూడా సన్యాసం గురించి **"కామ్యానాం కర్మణాం న్యాసం సన్యాసం కవయో విదుః"** అని వివరించారు కదా! గీతాచార్యులు వివరించిన కర్మలో అకర్మ ఎలా సాధ్యమవుతుంది అన్న అనుమానం కలుగుతుంది. దానికి సమాధానంగా ఆయనే

**"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ "** -

అని తెలుపుతూ లోక వేద వ్యాపారమైన ప్రతి పనినీ ఆయనకే అర్పిస్తున్నామన్న భావనతో చేయమని ఆదేశిస్తారు.

ఈ విధంగా నారదుల వారు ఈ సూత్రం ద్వారా అహంకారమును త్యజించి లోక వేద వ్యాపారములన్నింటినీ భగవంతుని కైంకర్యముగా భావించడమే నిరోధమనీ దాని వలననే భగవద్భక్తి పెంపొందుతుందనీ తెలియచేస్తున్నారు.

- సశేషం

# మాయా వైభవము

- కుట్టీ. యన్.

దేవేంద్రుడు ఒకసారి శాపవశాత్తు పంది జన్మ ఎత్తి భూలోకంలో ఒక మడుగులో తన నివాసం ఏర్పరచుకున్నాడు. తన భార్యా బిడ్డలతో హాయిగా ఆ బురదలో పొర్లుతూ ఆనందంగా జీవితం గడుపుతున్నాడు. ఒకరోజు త్రిలోక సంచారియైన నారదుడు అటుగా వెడుతూ, పంది రూపంలో వున్న దేవేంద్రుడి దుస్థితి చూసి, జాలిపడి, దగ్గరగా వచ్చి, 'ఓ వరాహమా! ఎలా వుండేవాడివి ఎలా అయ్యావు! నిన్ను చూస్తే నాకు చాలా జాలి వేస్తోంది. నా తపశ్శక్తిచేత నీ శాపం పోగొట్టి, ఈ పంది రూపాన్ని వదలి తిరిగి దేవేంద్రుడివై స్వర్గానికి పోయేలాగా చేయాలని సంకల్పించాను. ఇది నీకు అంగీకారమేనా?' అని నారదుడు పంది రూపంలో వున్న దేవేంద్రుడిని అడిగాడు.

దానికి సమాధానంగా పందిరూపంలో వున్న ఆ దేవేంద్రుడు 'ఓ నారద మహర్షీ! నీకు ఒక నమస్కారము! దయచేసి మీరు త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపొండి. నా ఈ ఆనందాన్ని భగ్నం చేయకండి. ఈ బురదలో పొర్లుతుంటే వుండే సుఖము ఆ స్వర్గంలో వున్నదని నేను అనుకోను. అంతేకాదు ఈ (ఆడపంది) నా భార్య వంటి సౌందర్యవతి ముల్లోకములలో ఎక్కడా దొరకదు. ఈ నా పుత్రులు (పంది పిల్లలు) నా సుకృతం కొద్దీ జన్మించారు. నా పూర్వ జన్మ సుకృతం వలనే నాకీ సుఖం లభించింది. దయచేసి నా ఈ ఆనందాన్ని పాడుచేయకండి!' అని పంది రూపంలో వున్న దేవేంద్రుడు నారద మహర్షిని వేడుకున్నాడు.

నారదమహర్షి ఆశ్చర్యపడి ఆ వైష్ణవ మాయావైభవాన్ని తలచుకుంటూ వెళ్ళిపోయాడు. ఇదియే అవిద్య యొక్క మాయ! జీవుడు సంసారంలోపడి, క్షణికమైన భోగభాగ్యాలలో పడి, దానికి వశుడైపోయి, ఆ ప్రాపంచిక విషయాలే సత్యమని భ్రమించి, ఆత్మను తెలుసుకోలేక పోతున్నాడు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జులై 2024**

1 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

4 గురు: మాసశివరాత్రి

5 శుక్ర: అమావాస్య

16 మంగళ: కర్కాటక సంక్రమణం - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

17 బుధ: తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

21 ఆది: ఆషాఢ(గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

30 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**ఆగస్ట్ 2024**

2 శుక్ర: మాసశివరాత్రి

4 ఆది: అమావాస్య

7 బుధ: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

16 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

17 శని : శనిత్రయోదశి

19 సోమ: శ్రావణ(రాఖీ) పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

27 మంగళ: శ్రీ కృష్ణాష్టమి - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

28 బుధ: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

31 శని : శనిత్రయోదశి

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి
(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**61. పూనిక విషయానందం, బానందము గాదు సుప్తి యానందం బ**
**త్యానందముగా దరసె తదానందానందు రాము నరయుము మనసా**

తాత్పర్యము: భౌతిక విషయానందము ఆనందముగాదు. తృప్తి పొందిన జీవిత ఆనందమే ఉన్నతమైనదిగా తెలిసి, అటువంటి ఆనందమే రామునిగా తెలియుము మనసా.

**62. అరయంగా దనువులకును గరణములకు నీవు మిగుల గారణమగుటన్**
**మఱి నీవకారణంబే, దొర తెలియవు రాముగాగ దొరకని మనసా.**

తాత్పర్యము: శరీరము, కర చరణాది అవయవములు నీ అధీనములో ఉన్నవని భ్రమ చెందక వానిని నడిపించువాడు శ్రీరామునిగా తెలియుము మనసా.

**63. తొల్లిటి తనువులు విడిచియు, నల్లన నీతనువునంటి యంటక మీదం**
**జెల్లంగల పురుషుని నీ యుల్లములో రాముగాగ నొగిగను మనసా.**

తాత్పర్యము: గతజన్మలు అనేకములుగా ఉన్నను వాటి వాసనలు ఈ జన్మమునందు పడనీయక నిను రక్షించువాడు రాముడని తెలిసి మనస్సున నిలుపుము మనసా.

**64. నిర్మల వృత్తిని సంచిత కర్మములటు ద్రోసి సమతకలిమి భవిష్య**
**త్కర్మము సేయక యిప్పటి కర్మంబెడబాసి రాము గనవే మనసా.**

తాత్పర్యము: నిశ్చల మనస్సుతో సంచిత కర్మములను తొలగించి భవిష్యత్ కర్మలు చేయక, నేటి కర్మలు మనస్సున రానీయక నిర్మల మనస్సుతో శ్రీరాముని తలచు మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

రావణ సన్యాసి మెల్లగ ఆమెతో మాటలాడనారంభించి సీతారామలక్ష్మణుల ముగ్గురిని గురించిన వివరములు తెలుసుకున్నాడు. పిదప తాను లంకానగరాధిపతి రావణుని నగరమునుండి వచ్చానని, ఆ అసురరాజుయొక్క ఘనతను వివరించనారంభించాడు. "నీవంటి రాజవంశపు యువరాణులు ఇలాంటి అరణ్యములందు కష్టపడకుండా ఉండాలంటే రావణుని శరణుకోరవలయునని" చెప్పాడు. ఈ మాటలనాలకించిన సీత, ఆతనితో, "నిన్ను ఓడించిన కార్తవీర్యార్జునుడ్ని మట్టి కరపించిన పరశురాముడంతటివాడ్ని నా నాథుడు తన విలువిద్యతో తలవంచుకునేటట్లు చేశాడు' అని సీత చెప్పగ, తన ముందు తరములవారు పొందిన అపజయమును జ్ఞప్తికి తెచ్చుకున్న రావణుడు తన కపట సన్యాసి వేషమునుండి నిజరూపములోనికి వచ్చాడు.

"ఓ అమ్మాయి! తెలుస్తుందా ఇప్పుడు నేనెవరోయని? ఇంద్రునితో సహా దేవతలందరూ నాకు సేవచేయుచున్నారు. నన్ను ఇప్పుడు జయించువారెవ్వరూలేరు. గాన నాతో వచ్చివేయుము. నిన్ను ముల్లోకాలకు రాణిని గావించెదను. విరహముతో రగిలిపోవుచున్న నాపై కాస్త కనికరించు" అని పలికి సీతయొక్క పాదములకు మ్రొక్కాడు ఆ అసురరాజైన రావణుడు.

"మా భర్తలేని సమయమున ఇచ్చటకు వచ్చి పిరికివానివలె నాతో వాదనజేయుటను నా భర్త చూసినట్లైతే నిన్ను పిండి చేసేస్తారు. కావున వచ్చిన దారిలోనే వెళ్ళిపో" అని సీత చెప్పిన వెంటనే రావణుడు ఆగ్రహావేశములకు లోనైనప్పటికీ, బ్రహ్మదేవుడు ఇచ్చిన శాపమును (స్త్రీలను బహు సునాయాసముగ లోబరచుకోగల రావణుని గుణమును తెలిసిన బ్రహ్మదేవుడు రావణునితో "రావణా! నీవు ఏ స్త్రీనైననూ ఆమె అనుమతిలేకుండా ముట్టుకొనినచో నీ పది తలలు ముక్కలైపోవును" అని శపించాడు) జ్ఞప్తికి తెచ్చుకుని, ఆమెను ముట్టుకొనకుండ, ఆ

పర్ణశాలనంతటినీ తన చేతితో ఎత్తిపెట్టి, తన పుష్పక విమానమందుంచి, లంకానగరమువైపుకు ఎగిరిపోయాడు.

"ఎవరది నాపుత్రికను తీసుకొనిపోవుచున్నది?" అన్న గొంతును విని వెనుకకు తిరిగి చూసిన రావణునికి ఒక పెద్ద పక్షి (జటాయువు) తనవైపుకు ఆగ్రహముతో ఎగురుచు వచ్చుట తారసపడింది.

'ఇదేమి విపరీతం? రామ లక్ష్మణులు రాకముందే సీతను తీసుకుని వెళ్ళాలని అనుకున్న తనకు ఈ పక్షి అడ్డుగ వచ్చుచున్నదే' యని తలచి, తన పుష్పక విమానమును క్రిందకు దించి, మంచి మనసుగల ఆ పక్షిని చంప యత్నించాడు. కానీ మిక్కిలి బలముగలదైన ఆ జటాయువు, తన వాడియైన రెక్కలతో ఆతనిని ఢీకొనడమేగాక ఆతని పది తలలపైనున్న స్వర్ణఖచితమైన కిరీటములను సహితం క్రింద పడవేసింది. ఇంకా ఆలసించినచో రాముడు తిరిగి వచ్చేస్తాడన్న భయంతో శివునిచే వరముగ పొందిన చంద్రహాసమను తన ఖడ్గమును తీసి రావణుడు జటాయువు యొక్క రెక్కలను నరికివేశాడు.

"హా! రామా!" అన్న వేదనతో జటాయువు నేలకొరిగింది. తండ్రివంటి జటాయువు మరణమొందుటను గాంచిన సీత తన భర్తను, మరిదిగారిని గట్టిగ కేకలువేసి పిలుస్తూ తనను కాపాడమని రోదించింది. రావణుడు పర్ణశాలను మరల తన పుష్పక విమానము పైనుంచుకుని తన పయనమును కొనసాగించి, లంకానగరమును చేరుకుని, తాను పెకలించిన పర్ణశాలతోబాటుగ సీతను తన అశోకవన మందుంచి బంధించాడు.

తన రెక్కలను కోల్పోయి, కొన ఊపిరితో బాధపడుచున్న జటాయువు 'రామా! శీఘ్రముగ ఇచ్చటకు వచ్చి చేరుము. నీకు సీత అపహరింపబడిన వార్తను తెలియజేయవలయును. అయ్యో! నా ప్రాణం పోవుచున్నదే...' అని రోదించుచూ క్రింద నేలపై కదలాడుచున్నది. 'నా ఆరోప్రాణమా! తొందరపాటుతనముతో నా ఈ శరీరమును వీడి వెళ్ళిపోవద్దు. దయచేసి కాస్సేపు రాముడు వచ్చువరకు ఇలా నా దేహమందుండు!' అని ఆతడు ఆర్తార్థముగ చెప్పకున్నాడు.

- సశేషం

# శ్రీ శంకర జయంతి

(గత సంచిక తరువాయి) - రమణ బాబు

శ్రీగురుదేవులు మమ్మలిని పొన్నూరు పోటీకి పంపించారు. నాతోపాటు బాల, ఆనంద వల్లి కూడా ఉన్నారు. నాది ముకుందమాల, శివానంద లహరి. ఎక్కడ అడిగితే అక్కడ చెప్పాలి. **'మోక్షసాధన సామాగ్ర్యాం భక్తిరేవ గరీయసీ'** అనే విషయంపై వ్యాసం వ్రాయాలి. సాయంత్రం ప్రార్థనకు వచ్చి శ్రీ గురుదేవులు, "ఆ! శివానంద లహరిలో 20వ శ్లోకం చెప్ప" అనేవారు. అది **"సదా తత్వాబ్జ పరమానంద లహరీ, విహారాసక్తం చేత్"** శ్రీ బాబు నాకు ముందే ప్రసాదం ఇచ్చేశారు. అంటే ఫస్ట్ ప్రైజ్ ఇచ్చేసారు. పోటీలో నాది సెకండ్ ప్రైజు. దానికి కారణాలు చాలా ఉన్నాయిలెండి.

ఎక్కడ చూసినా మనం మనస్సును గుర్తిస్తే దాని పోకడ లేకుండా పోతుంది. అప్పడు మనం అమృతత్వాన్ని పొందుతాం. మృత్యువు లేని స్థితి మనం బ్రతికి ఉండగానే పొందితే ఏది వచ్చినా లెక్క చెయ్యరు. శ్రీ గురుదేవులు యాత్రలలో కూడా ఎన్నో చూపించారు. జోషీమఠ్‌లో ధ్యానం చేయించారు. కేదార్‌లో శ్రీశంకరులవారు అలా నడిచి వెళ్ళి తిరిగి రాలేదని చెబుతారు. ఇంకా వేరు వేరు కథనాలు కూడా ఉన్నాయి.

ఇవ్వాళ శ్రీ గురుదేవులు ఎన్ని ప్రసాదించారంటే, శ్రీశంకర జయంతితో పాటు శ్రీ రామానుజ జయంతి, శ్రీ సూరదాసు జయంతి, శ్రీ గురుదేవులు బృందావనంలో ప్రతిష్ఠితమైన 30వ వార్షికోత్సవము ఈ రోజు కలిసి వచ్చాయి. **"కాకే ద్వారే జాయ్ శిర్ నావూఁ పరహాత్‌కా బికావూఁ। తుమ తజ్ ఔర్ కౌన్‌పై జావూఁ। ఐసేకో దాతా హై సమరథ్ జాకో దియే అఘావూ।**

"ప్రభూ! నీ పాదాలను విడిచి ఎక్కడకు పోగలను? నీ వంటి సమర్థవంతమైన దాత ఇంక ఎవరు ఉన్నారు?" ఎవరు చెప్పగలరు ఇలాంటివి? దేని వలన మనకు తృప్తి, ఆనందాలు కలుగుతున్నాయి? ఈ ఆనందాన్ని మనకు శ్రీ గురుదేవులే ప్రసాదిస్తున్నారు. ఎంత బాగుంది? ప్రపంచం వైపు చూస్తే అన్నీ దుఃఖాలే. నువ్వు సంపాదించినవి ఏవైనా నీతో వస్తున్నాయా? నీ వెంట వచ్చేది భగవన్నామమొక్కటే! శ్రీ ఆది శంకరులు - **'భజ గోవిందం! భజ గోవిందం! గోవిందం భజ మూఢమతే। సంప్రాప్తే**

**సన్నిహితే కాలే, నహి నహి రక్షతి డుక్నృఞ్ కరణే**. ఇది శ్రీ శంకరులు వ్యాకరణ సూత్రాలు వల్లె వేస్తూ జీవితాన్ని వృధా చేస్తున్న వృద్ధ పండితుని చూసి జాలితో చెప్పిన శ్లోకం. గోవిందుడు అంటే శ్రీశంకరుల గురువుగారైన శ్రీగోవిందపాదాచార్యులవారు. ఆయనే పరమాత్మ, ఆయనే శ్రీరామచంద్ర ప్రభువు. ఆ యా యుగాలలో ఆ యా సమయాలలో **"అహం సంభవామి"** అని వారు ఉద్భవించారు. వారు నీలోనే, నీ హృదయంలోనే ఉన్నారు.

ఇందాక దిగ్విజయ్ జయదేవుని గురించి చెబుతుంటే ఒళ్ళు పులకరించి పోయింది. మంచి టాపిక్ తెచ్చాడు. మహారాజుగారు వేటకు వెళ్తూ, జయదేవుని వెంట తీసుకొని వెళ్ళేవారు. జయదేవుని భార్య పద్మావతీ దేవి. ఆవిడ  రాణీ వారితో మంచి విషయలను ప్రస్తావించేది. ఆ రోజులలో భర్త చనిపోతే భార్య సహగమనం చేసేది. ఒక రోజున ఈ ప్రసక్తి వచ్చింది. పద్మావతి, "అంతవరకు ఎందుకు? పతివ్రతా స్త్రీ ఆ వార్త వినగానే తన ప్రాణాలను వదిలేస్తుంది." అన్నది.

రాణిగారు : అదెలా కుదురుతుంది?

పద్మావతి : నిజమైన పతివ్రత అయితే అలానే జరుగుతుంది.

- సశేషం

**పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు**

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జులై 2024**

1 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

17 బుధ: తొలి ఏకాదశి - శ్రీ సద్గురు పాదపూజ.

21 ఆది: ఆషాఢ (గురు) పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

30 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

**ఆగస్ట్ 2024**

19 సోమ: శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

28 బుధ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

# మనస్సును అంతర్ముఖం చేయి

- కీ.శే. జానకిరామ శాస్త్రి

"అన్నియు నాలో నుండగ నవ్వల నేమి చూచేము" అంటూ మనకు హితవు పలుకుతున్నాడు పదకవితా పితామహుడు అన్నమయ్య. అన్నీ మనలోనే ఉన్నాయి. బయట వెదికే పని లేదు. మన బ్రతుకే వినోదం! మన నడకే ఓ విన్యాసం.

బాహ్య ప్రపంచంలో అన్వేషించే అన్ని విద్యలు అంతరంగంలోనే ఉన్నాయనీ, ఏ వినోదం కోసమో ఎక్కడకూ వెళ్ళవలసిన అవసరం లేదనీ మనకు గుర్తు చేస్తున్నాడు. మన ఇంద్రియాల వ్యవహారమే పెద్ద ఇంద్రజాలం. చావుపుట్టుకలే ఒక విన్యాసం. శ్రీ బాబూజీ మహరాజ్ "బయట ఏ ఆనందమూ లేదు. నీలోకి నీవు చూసుకో, సమస్త ఆనంద మార్గాలు అక్కడే కనిపిస్తాయి" అని భక్తులకు భోదించియున్నారు.

బయటి ప్రపంచంలో తలమునకలవటం మనసు స్వభావం. బహిర్ముఖమవటంలో ఉన్న ఆసక్తి అంతర్ముఖమవటంలో ఉండదు. అందుకే మనసును మర్కటంతో పోలుస్తారు. అలాంటి ఆ చంచల స్వభావిని ఒక్కసారి తనలోకి తనని చూసుకోమంటున్నాడు అన్నమయ్య. **"అన్నియు నాలో నుండగ నవ్వల నేమి చూచేవు యెన్నడు గానని మాయ యెరగవో మనసా "** - ఆ వైపూ, ఈ వైపూ వెళ్ళకుండా మనసును నిగ్రహించుకుంటే చాలు, ఉన్న చోటనే ఉంటూ జ్ఞానం సముపార్జించ వచ్చు. మనస్సును వక్రమార్గంలో కాకుండా సవ్యమైన మార్గంలో పయనింపజేస్తే ఈ ప్రాపంచికత నుంచి కడతేరవచ్చు. కోదండరాముడి శరణాగతుడు శ్రీ త్యాగరాజస్వామి కూడా... **"మనసా! ఎటులోర్తునే నా మనవిని చేకొనవే..."** అన్న **కీర్తనలో "సులభముగా కడతేరను సూచనలను తెలియజేయు, ఇలను త్యాగరాజు మాట వినవదేల గుణ విహీన!"** అంటారు.

ఈ సంసారం ఒక ఇంద్రజాలం. జీవితమనే నాటకంలో జీవుడు ధరించే బహురూపాలు, ప్రదర్శించే విద్యలు, నాటకం ముగిసిన తరువాత ఉండవు. గమ్మత్తుగా స్మృతి పటలంలో మాసిపోతాయి. ఒక్కసారి మన మనసును మనం స్వాధీనపరచుకోవటం నేర్చుకుంటే సమస్త ప్రపంచమూ మనకు స్వాధీనమవుతుంది. అదే లోకంలో అన్ని విద్యలకెల్లా పెద్ద విద్య. "తన మనస్సును నిగ్రహించుకోవటం చేతనైన

వ్యక్తికి ఇతరుల మనస్సుల రహస్యాలు తెలుస్తాయి. ఇతరుల మనస్సులను నియంత్రించగల సమర్థత అతడికి కలుగుతుంది" అంటారు స్వామి వివేకానంద.

**"దినదినము నాటకమై యుండగ"**- అవసరం కోసం మనిషి ఆడని నాటకం లేదు. వేయని వేషమూ లేదు. వాటితో పోలిస్తే బాహ్య ప్రపంచము లోని ఏ నాటకమూ, ఏ వేషమూ, ఆకర్షణీయం కాదు. మనిషి కపటపు వ్యవహారాలతో సరిచూస్తే, ఏ కనికట్టు విద్యలూ వాటికి సాటిరావు. **"శ్రీ వేంకటేశుడిటు భ్రమ బాపె"**- ఈ లోకంలో మనం చేసే పాపపుణ్యాల్లో కూడా ఎంతో నేర్పు ఉంటుందట. ఆ నేర్పరితనం ముందు ఎంతటి భయం కరమైన విన్యాసాలైనా దిగదుడుపేనట! ఆ బ్రహ్మాండ నాయకుడు మనలోని భ్రమలన్నీ పటాపంచలు చేస్తే అప్పుడు అర్థమవుతుంది లోకంలో మన పనులు ఎంత హాస్యాస్పదమైనవో! అప్పుడు మన పనుల్ని చూసి మనమే నవ్వుకుంటామట!

**"పాపపుణ్యములు రెండు బారివిద్య లుండగాను**
**కోపుల నాటలవారి కోరి చూచేము**
**యేపున శ్రీ వేంకటేశు డిటు మమ్ముబ్రమబాపె**
**నా పనులు నేనే చూచి నవ్వులు నవ్వేను......"** అంటూ కీర్తనకు ముక్తాయింపు పలుకుతున్నారు తాళ్ళపాక అన్నమాచార్య.

పరమాత్మను నమ్ముకుంటే తప్ప ఈ ప్రపంచ పోకడలు మనకు స్పష్టంగా అర్థం కావు. చివరకు మన ప్రవర్తనలోని లోటుపాట్లు కూడా అవగతం కావు. అందుకే భద్రాచల రామదాసు కూడా ఓ కీర్తనలో మనసుకు నచ్చజెపుతూ **"నరహరి నమ్మక నరులను నమ్మితే నరజన్మ మీదేరునా ఓ మనసా..."** అని అనునయిస్తాడు.

"ప్రపంచం వైపు పరిగెత్తే మనస్సును అంతర్ముఖం చేసి నీలో ఉన్న పరమాత్మను దర్శించు. అప్పుడు ఈ ప్రపంచం మిథ్య అని, జీవులు ఈ నాటకంలో పాత్రధారులని గ్రహించగలుగుతావు. మనస్సుని నిలకడ చేయటానికి భగవన్నామ స్మరణ, నిరంతర ధ్యానం ఎంతో తోడ్పడుతాయి" అని శ్రీ మాతాజీ వారు తమ బోధలలో వివరించి ఉన్నారు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్



శ్రీ బాబు పూజ, తీర్థము అయిన తరువాత బోధ చెబుతూ "ఇందాక ఆ పాప తల మీద నేను చిన్న దెబ్బ వెయ్యటమూ, కురుపులు చితికి చీమూ నెత్తురూ రావటమూ అందరూ చూశారు గదా! తలో రకంగాను అనుకుని ఉంటారు. ఆ కురుపులు, బాధ ఎంతో పూర్వ కర్మకు అనుభవ రూపంలో ఆ పాపకు వచ్చినవి. తల్లి చాలా మంది డాక్టర్లకు చూపించటం, రకరకాల మందులు వాడటం, ఫలితం లేకపోవటం జరిగింది. ఇక్కడ ఎవరో మహాత్ములున్నారని, వారికి చూపిస్తే తగ్గిపోతుందని, తెలిసిన వారెవరో చెప్పి ఆమెను యిక్కడికి పంపించారు. ప్రొద్దుటి నుంచి నాతో మాట్లాడవలెనని ఆమె ప్రయత్నిస్తున్నది. అవకాశం కలగటం లేదని ఆవేదన పడుతున్నది. మా అమ్మ జగన్మాతకు తెలియనిదేమున్నది? ఇందాక నేను స్నానానికి వెడుతుంటే మా అమ్మ"పాపం! ఆ తల్లి బాధ పడుతున్నది. ఆ పాపకు చేయవలసిన వైద్యమేదో చేసి వెళ్ళరా" అని నా చేత అలా చేయించింది. అమ్మ దయ వలన మూడు రోజులలో కురుపులన్నీ మాడిపోతాయి.

కాని ఆ పాప తల్లి ఏమనుకున్నదో తెలుసా?''ఈయన మహాత్ములన్నారే? అసలే కురుపులతో బాధపడే పిల్లను అలా జాలి లేకుండా దెబ్బ కొట్టి వెళ్ళారేమిటి? పిల్ల బాధ భరించలేక గుక్కపట్టి ఏడ్చింది. పోనీ, 'దోవలో పిల్ల ఉన్నది; ఎవరైనా ప్రక్కకు తీయండి' అని చెప్పవచ్చును గదా! " అనుకుంది. తూనా బొడ్డు. నేను అబద్ధమాడను. మాది ఇక్ష్వాకు వంశం. నిజమో కాదో, ఆ అమ్మనే అడగండి. ఏమమ్మా? నేను చెప్పినది నిజమేనా కాదా?" అని శ్రీ బాబు అడిగారు. ఆమె లేచి లెంపలు వేసుకుని "క్షమించండి బాబూ! నేనలా అనుకున్న మాట నిజమే" అన్నది. శ్రీ బాబు "చూశారా? ఇలాగే మనం కూడా, ఒక చిన్న కష్టం కలిగితే, అది మన మంచి కోసమే అని

అర్థం చేసుకోలేక, భగవంతుణ్ణి అపార్థం చేసుకుంటాము'' అన్నారు.

4. భీమవరం తాతయ్యగారింట్లో శ్రీ బాబు ఉన్నపుడు, ఒక భక్తుడు తన మిత్రుణ్ణి శ్రీ బాబు దర్శనానికి తీసుకుని వచ్చాడు. వారిరువురు హాలులో కూర్చుని మాట్లాడుకుంటుండగా శ్రీ బాబు వచ్చారు. భక్తుడు నమస్కారం చేసుకుని, తమ మిత్రుణ్ణి పరిచయం చేశాడు. ఆయన శ్రీ బాబును, వారి మాట తీరును గమనిస్తూ ఉండిపోయాడు. నమస్కారం చేయలేదు. శ్రీ బాబు వారిని "తమరేం చేస్తూ ఉంటారు?'' అని అడిగారు. ఆయన "నేను పి.హెచ్.డి. చేశానండి. జియోఫిజిక్స్, అంటే భూభౌతిక శాస్త్రము అని ఒక శాస్త్రము వుంది లెండి. దానిలో నేను రిసెర్చ్, అంటే పరిశోధన చేశాను'' అన్నాడు. "భూభౌతిక శాస్త్రము అంటే ఏమిటండి?'' అన్నారు శ్రీ బాబు. "భూమి కూడా కొన్ని భౌతిక శాస్త్ర సూత్రాలను అనుసరించి నడుచుకుంటుంది లెండి. అదొక పెద్ద సబ్జెక్టు లెండి. అందులో మళ్ళీ అనేక విభాగాలుంటాయి లెండి'' అంటూ, శ్రీబాబుకు అవన్నీ తెలియవు లెమ్మన్నట్టుగా మాట్లాడాడు.

శ్రీబాబు మాత్రం ఆయన చెప్పిన ప్రతిదానికి 'చిత్తం, చిత్తం. అలాగా!' అంటూ చెప్పినంత సేపూ విన్నారు. తరువాత "తమరిప్పుడు చేస్తున్న పరిశోధన ఏ విభాగంలో, ఏ పాయింటు ఋజువు చేయాలని జరుపుతున్నారు?'' అని అడిగారు. ఆయన యింకా ఉత్సాహంగా "..........ఉంటుంది లెండి'' అంటూ కొంత చెప్పుకు పోయాడు.

అప్పుడు శ్రీ బాబు ఒక పాశ్చాత్య శాస్త్రజ్ఞుని పేరు చెప్పి "వీరు యిప్పుడు తమరు చెప్పిన శాస్త్ర విభాగానికి సంబంధించిన పరిశోధకు లనుకుంటాను?'' అన్నారు. ఆయన కాస్త ఆశ్చర్యపడుతూ "అవునండి'' అన్నాడు. శ్రీ బాబు "ఇందాక తమరు చేస్తున్న రిసెర్చికి సంబంధించినవి నాలుగు పాయింట్లు చెప్పారు. అందులో మొదటి రెండు పాయింట్ల విషయంలో మీ రిసెర్చి సరియైన ఫలితాలనే యిస్తుంది. కాని మిగతా రెండు పాయింట్ల విషయంలో మీరు అనుసరిస్తున్న విధానం సరియైనది కాదు. వాటికి సంబంధించిన వివరాలు, యిందాక నేను చెప్పిన ఆ శాస్త్రజ్ఞుడు వ్రాసిన పుస్తకంలో ఉన్నాయి. కలకత్తా లైబ్రరీలో ఆ పుస్తకం దొరుకుతుంది. అది చదవండి. లేకపోతే మీరు మళ్ళీ మొదటికే రావలసి వస్తుంది'' అన్నారు.

- సశేషం

## విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

# చైతన్య మహాప్రభువు

తల్లిదండ్రులు సంతోషించి అతనిని "గంగాదాస్" అనే పండితుని వద్ద విద్యాభ్యాసానికి చేర్చారు. చైతన్యులు ఏకసంథాగ్రాహి. అతని ప్రజ్ఞావిశేషాలకు అతని గురువుగారైన గంగాదాస్ ఆశ్చర్యపడేవారు. విద్యాశక్తితో పాటు చైతన్యునిలో ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా వుండేది. స్నానం చేస్తున్నా, నడుస్తున్నా, భోజనం చేస్తున్నా అతడి అంతరంగంలో శ్యామసుందరుడే నాట్యం చేస్తుండేవాడు. అతని పదకొండవ ఏట తండ్రి పరమపదించాడు. అతని విద్యాభ్యాసం కుంటుపడింది. కుటుంబ పోషణా భారం తల్లి మీద పడింది.



చైతన్యుడు విద్యాభ్యాసానంతరం ఉపాధ్యాయుడిగా చేరాడు. న్యాయ అలంకార శాస్త్రాలలో విశేష ప్రతిభ గడించి న్యాయ శాస్త్రంలో గదాధరుని, అలంకార శాస్త్రంలో ముకుందుని ఓడించాడు. నవద్వీపంలో పండితులు అతనిని 'ప్రజ్ఞాధురంధరుడు' అని పొగిడారు.

ఇంటి ప్రక్కన ఉంటున్న 'లక్ష్మీదేవి' అనే అమ్మాయితో చైతన్యునికి వివాహం జరిగింది. లక్ష్మీదేవి సుగుణవతి, విద్యావంతురాలు. ఆమెకు చిత్రలేఖనంలో కూడా ప్రావీణ్యం ఉంది. శ్రీ చైతన్యులవారి చిత్రపటాన్ని ఎంతో సుందరంగా చిత్రించింది.

నవద్వీపమునకు వచ్చిన కేశవభట్టుని వాదనలో ఓడించాడు. చైతన్యుల కీర్తి నలుమూలలా వ్యాపించింది.

ఈశ్వరపురి ప్రేరణతో అతడు కృష్ణభక్తుడైనాడు. చైతన్యులు పర్యటనలో ఉన్న సమయంలో ఆయన భార్య లక్ష్మీదేవి పాము కరిచి చనిపోయింది. చైతన్యులవారు యాత్రనుండి రాగానే ఈ విషాద వార్త ఆయన చెవిన పడింది. నవద్వీప ఆస్థాన పండితుడైన సనాతన మిశ్రగారి కుమార్తె విష్ణుప్రియా దేవితో చైతన్యులవారికి ద్వితీయ వివాహం జరిపించారు.

చైతన్యులవారు కొందరు శిష్యులతో గయ క్షేత్రానికి వెళ్ళి విష్ణుపాదంలో తన తండ్రికి పిండ ప్రదానం చేసి, ధ్యానం చేస్తూ భక్తి పారవశ్యంలో క్రిందపడి మూర్ఛపోయాడు. తనకు ఇంతకు ముందు పరిచయమైన ఈశ్వరపురి మహాత్ముడు అచటకు వచ్చి అతనిని స్వస్థుడిగా చేశాడు. చైతన్యులు ఆయనకు నమస్కరించి "మహాత్మా! నా తనువు, మనస్సు నా సర్వస్వం మీ పాదాలకు సమర్పించు కుంటున్నాను. నన్ను అనుగ్రహించండి" అని ఆయన పాదాలపై పడ్డాడు. ఈశ్వరపురి అతనిని లేవనెత్తి దశాక్షర గోపాల మంత్రాన్ని ఉపదేశించాడు.

ఈశ్వరపురి నుండి మంత్ర దీక్ష తీసుకున్న తరువాత అతని హృదయంలో కృష్ణభక్తి పెల్లుబుకింది. ఉన్నట్లుండి నాట్యం చేస్తాడు. ఒక్కోసారి భజనలు చేస్తాడు. ఒకసారి నేలమీద పొర్లుతూ "కృష్ణా! నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళకు" అని విలపిస్తాడు.

"ఓ నందనందనా! నేను నీ దాసుడను. ఈ భవసాగరంనుండి నన్ను దాటించు" అని వేడుకొంటాడు. అనవరతము శ్రీ కృష్ణ నామామృతాన్ని పానం చేస్తున్నాడు. ఇతని భక్తి పారవశ్యమును తిలకించిన ఈశ్వరపురి "చైతన్యుడు పరమ భాగవతోత్తముడు. ఇతడు అనేకమందిని తరింప చేస్తాడు" అని ఆతనిని పొగిడాడు.

- సశేషం

('దానం' తరువాయి భాగం 14వ పేజీ నుండి..................)

**భియా దేయం** - భయపడుతూ దానమివ్వాలి. 'భయమెందుకు?' అంటే 'మనకున్నది అయిపోతుందేమో' అని కాదు. 'నేను సరిగ్గానే దానమిస్తున్నానా? దేశకాలాలకు తగినట్లుగా, సరైన పాత్రత కలిగిన వారికే ఇస్తున్నానా? శ్రద్ధగా ఇస్తున్నానా? ఇచ్చిన దానిమీద వెంటనే విరాగాన్ని పొందుతున్నానా? నా స్తోమతకు తగినంతగా ఇస్తున్నానా? నాలో గర్వం కలగడం లేదు కదా?' ఇలా అనుక్షణం తనను తాను పరిశీలించుకుంటూ, భయభక్తులతో దానం చెయ్యాలి. శ్రద్ధ, భయభక్తులు లోపించిన ఏ కార్యమైనా అహంకారానికి, ఆ వ్యక్తి పతనానికి దారితీస్తుంది.

**సంవిదా దేయం - సంవిత్** అంటే జ్ఞానం. దానమిచ్చే పద్ధతినెఱిగి ఇవ్వాలి. అలాగే **సంవిదా** అంటే ఒప్పందం. అంటే ఒకసారి ఇస్తానని మాట ఇచ్చిన తరువాత తనకు ఎంత కష్టమొచ్చినా వెనుదిరగకూడదు. శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి, కర్ణుడు, సక్తుప్రస్థుడు, హరిశ్చంద్రుడు ఇటువంటి దాతలందరూ తమకు ఎంతటి కష్టం కలిగినా వెనుదిరుగక దానమిచ్చినవారే. అటువంటివారు మనకు ఆదర్శం కావాలి.

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.



ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఎంతో ఉదారస్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగు నట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.
Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

26.05.2024 నుండి 10.06.2024 వరకు శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన దృశ్యములు.









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## శ్రీ కాళీవనాశ్రమము నందు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు






If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.